క్లుప్తంగా

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు చర్యలు



మాట్లాడుతున్న సుడా అధికారి అమర్నాథ్

రాజాం సిటీ: గ్రామ పంచాయతీల్లో అనధికారిక లేఅవుట్ల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని 'సుడా' ప్లానింగ్ అధికారి అమర్నాథ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎల్ఆర్ఎస్ పథకం, లేఅవుట్ల క్రమబద్ధీకరణ గురించి వివరించారు.ఎంపీడీఓ జె.ఆనందరావు, డిప్యూటీ ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవకు ప్రాధాన్యం



రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలను వివరిస్తున్న కార్యవర్గం

బొబ్బిలి: రోటరీ క్లబ్ సభ్యులంతా సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని రోటరీ క్లబ్ మాజీ సభ్యుడు ఏ.వి.రంగారావు అన్నారు. శుక్రవారం స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో క్లబ్ చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవతోనే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జె.సి.రాజు మాట్లాడుతూ జిల్లా గ్రాంట్ ద్వారా సమకూర్చిన కుట్టు మిషన్లను త్వరలో మహిళలకు పంపిణీ చేస్తామని చెప్పారు. కోమటిపల్లిలో కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. రోటరీ క్లబ్ బొబ్బిలి అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహరి, శివకాంత్,సింద్రీ శ్రీనివాసరావు, కల్యాణ్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది రెస్టారెంట్లపై కేసులు



మాట్లాడుతున్న ఫుడ్ సేఫ్టీ అధికారి పి.వి.రమణ

బొబ్బిలి: డివిజన్లో ఎనిమిది రెస్టారెంట్లపై ఆహార కల్తీ కేసులు నమోదు చేసినట్టు ఫుడ్ సేఫ్టీ అధికారి పి.వెంకటరమణ తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్లోని రెస్టారెంట్లు, హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఆహార పదార్థాల శాంపిల్స్ తీశామన్నారు. వాటిని ల్యాబ్లో పరీక్షించగా, ఎక్కువగా రంగు, టేస్టింగ్ సాల్ట్ కలిపిన, నిల్వ చేసిన, కల్తీ ఆహార పదార్థాలుగా నిర్ధారించామన్నారు. ఇప్పటివరకు 28 కేసులు నమోదు కాగా అందులో పది కేసుల విచారణ పూర్తయ్యి, ఒకరికి జైలు శిక్ష కూడా పడిందని చెప్పారు. మరో 18 కేసులు విచారణలో ఉన్నాయన్నారు. వంట నూనెను మళ్లీ మళ్లీ వాడడం ప్రమాదకరమని స్పష్టం చేశారు. ఎక్కడ ఆహార కల్తీ జరిగినా 94403 18273 నంబర్కు ఫోన్చేసి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు

రాజాం: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రాజాం పర్యావర పరిరక్షణ సమితి సభ్యులు పిలుపునిచ్చారు. రాజాంలో శ్రీకాకుళం-బొబ్బిలి ప్రధాన రహదారిలో రోడ్డు మధ్య డివైడర్లలో శుక్రవారం మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, రాజాం పర్యావర పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు, సభ్యులు రెడ్డి శ్రీనివాసరావు, శిష్టి లక్ష్మునాయుడు, పెంకి చైతన్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



తారాపురంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ శివ

రామభద్రపురం: సస్యరక్షణ చర్యలతో వరి పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి(ఏఓ) ఎం.శివ అన్నారు. మండలంలోని తారాపురంలో వరి పంటను శుక్రవారం పరిశీలించారు. పంటను ఆశించిన తెగుళ్లను గుర్తించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.అగ్గి తెగులు నివారణకు ట్రైక్లోజోన్ 120 గ్రాముల మందును,ఆకు ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 250 గ్రాముల మందును ఎకరానికి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. పీకపురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును 250 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు.అలాగే వరి పంటలో ఆఖరి దఫా ఎరువులు వేసేటప్పుడు 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ కలిపి వేసుకోవాలని చెప్పారు. ఆయన వెంట వీఏఏలు ఉన్నారు.

అన్నదాత 'సంపద' సాగు

- వరిలో కొత్తరకం విత్తనం 'సంపద' సాగుపై రైతులు మక్కువ
- రాజాం నియోజకవర్గంలో 35 వేల ఎకరాల్లో సాగు
- తగ్గిన శ్రీధృతి, 1001 రకాల సాగు విస్తీర్ణం
- స్వర్ణ, సాంబమసూరి రకాల సాగు యథాతథం



రేగిడి మండలం అంబఖండి సమీపంలో సాగులో ఉన్న సంపద రకం వరి

రాజాం నియోజకవర్గంలో వరి సాగు వివరాలు	
మండలం	వరి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
రాజాం	8,600
రేగిడి	15,800
వంగర	10,800
సంతకవిటి	13,800

రాజాం: నియోజకవర్గ రైతులు ఈఏడాది ఖరీఫ్ సీజన్లో కొత్త రకం వంగడం సాగుచేస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు ఖరీఫ్లో ఎక్కువగా 1001 రకం వరిని సాగుచేసేవారు. ఈ పంట బియ్యం ముదుకుగా ఉండడంతో రైతులు వీటిని పక్కన పెట్టారు. ప్రత్యామ్నాయంగా శ్రీధృతి రకం వంగడాన్ని గతేడాది సాగుచేశారు. ఈ రకం ఆశించినంత దిగుబడి రాకపోవడం, పంట చివరి దశలో సాగు నీటి తడులు అందకపోతే పంట చనిపోవడం వంటివి జరిగేవి. ఈ కారణాలతో ఈఏడాది శ్రీధృతి రకాన్ని కూడా తగ్గించి 'సంపద' రకంపై రైతులు మక్కువ చూపించారు. గతేడాది కంటే ఈ ఏడాది ఈరకం వరి సాగు మరింత అధికమైంది.

సగానికిపైగా 'సంపద' పంటే..

ఈ ఏడాది ఖరీఫ్లో నియోజకవర్గంలో 52 వేల ఎకరాల్లో వరి సాగును వ్యవసాయశాఖ లక్ష్యంగా చేసుకోగా, 49 వేల ఎకరాల్లో రైతులు పంట వేశారు. 'సంపద' రకం వరి పంట సాగుకు రైతులు ఎక్కువ ఆసక్తి చూపించారు. ఈ పంట 130 నుంచి 138 రోజుల వ్యవధిలో కోతదశకు రావడంతో పాటు చీడపీడలను తట్టుకునే సామర్థ్యం ఉందని ఏడీఏ చంద్రరావు తెలిపారు. ప్రతికూల వాతావరణాన్ని అధిగమించడంతో పాటు పంట దిగుబడి వస్తుందని, సన్న రకం బియ్యం ఉత్పత్తి ఉంటుందని రైతులు ఈ రకం వరిని ఎక్కువగా సాగుచేస్తున్నారని చెబుతున్నారు. మొత్తం 49 వేల ఎకరాల సాగులో 'సంపద' రకం సాగు 35 వేల ఎకరాలు దాటిఉందని వివరించారు. ఎకరానికి 28నుంచి 32 బస్తాల దిగుబడి వస్తుందని ఏడీఏ వెల్లడించారు. ఈ ఏడాది సాంద మసూరీ స్థానంలో ఎక్కువగా ఎంటీయూ 1224 రకం వరి పంటను తీసుకొచ్చారు. గతంలో బీపీడీ -5204(సాంబ మసూరీ) రకం పంటను అధికంగా సాగుచేయగా, ఇప్పుడు ఈ పంట స్థానంలో కొత్త సాంబ మసూరీ వంగడాన్ని రైతులకు వ్యవసాయశాఖ అందించింది. మరో వైపు స్వర్ణ రకం పంటలు సాగు కూడా గతేడాది మాదిరి యథావిధిగా సాగులో అధికంగా ఉన్నట్లు కనిపిస్తున్నాయి.

సాగుచేస్తున్న వరి రకాలు	
రకం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
సంపధ	35,000
స్వర్ణ	5,300
ఎంటీయూ-1121 (శ్రీధృతి)	4,200
ఎంటీయూ-1224 (సాండమసూరీ)	4,500



సంతకవిటి మండలం మిర్తివలస సమీపంలో సంపద రకం వరి

సంపద బాగుంటుంది



'సంపద' రకం వరి వంగడం రైతులకు అనుకూలంగా ఉంటుంది. రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ విత్తనాలు అధికంగా పంపిణీ చేశాం. చీడపీడలను ఈ పంట తట్టుకుంటుంది. బియ్యం రకం బాగుండడంతో పాటు రుచిగా ఉంటుంది. దిగుబడి వరి వంగడాల్లో అన్నింటికంటే ఈ రకంలోనే ఎక్కువగా వస్తుంది. ఈ విత్తనాలపై రైతులు అధికంగా ఆసక్తి చూపించారు.

-కె.చంద్రరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రాజాం.

బాలకృష్ణవి దిగజారుడు వ్యాఖ్యలు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అచ్చెన్నాయుడు,తదితరులు

రేగిడి: హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ శాసనసభలో సినీనటుడు మెగాస్టార్ చిరంజీవితో పాటు మాజీ ముఖ్య మంత్రి వైఎస్.జగన్మోహన్రెడ్డిపై గురువారం చేసిన అనుచిత వ్యాఖ్యలు ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమని వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని కె.వెంకటాపురం గ్రామంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సభలో లేని వ్యక్తులపై అసందర్భంగా పరుష పదజాలంతో అసభ్యకరంగా బాలకృష్ణ మాట్లాడిన తీరు చూసి ప్రజలు ఆయన్న ఛీకొడుతున్నారని అన్నారు.సినీ ఇండస్ట్రీకి పెద్ద దిక్కుగా ఉన్న చిరంజీవి గురించి వాడు, వీడు, ఎవడు, నాన్సెన్స్ అంటూ సభ్యత లేకుండా వ్యంగ్యంగా మాట్లాడడం పెద్దరికమనిపించుకోదన్నారు. చిరంజీవికి జరిగిన అవమానంపై ఆయన తమ్ముడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించాలని డిమాండ్ చేశారు. తన అన్నను ఇంతగా అవమానించిన తర్వాత కూడా పవన్ కల్యాణ్ స్పందించకుంటే అంతకుమించిన దౌర్భాగ్యం మరొకటి ఉండదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని సైకో అంటూ అమర్యాదగా బాలకృష్ణ మాట్లాడడం చూస్తుంటే ఆయన మానసిక పరిస్థితి సరిగా లేదని అనిపిస్తోందన్నారు. జగన్మోహన్రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన ద్వారా మేలు పొందిన వ్యక్తుల్లో తాను కూడా ఉన్నానన్న విషయం బాలకృష్ణ గుర్తు చేసుకోవాలని హితవుపలికారు. బాలకృష్ణ ఇంట్లో కాల్పులు జరిగేటప్పుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్రెడ్డి రాజకీయంగా ఆలోచించి ఉంటే ఈ రోజు బాలకృష్ణ అసెంబ్లీలో అడుగుపెట్టేవారా అని ప్రశ్నించారు. రాజకీయాలు చేసేటప్పుడు హుందాతనంగా ఉండాలి తప్ప దిగజారుడు మాటలు ఆడి ప్రజల అభిమానాన్ని పోగొట్టుకోకూడదని అన్నారు. మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు, రాష్ట్ర పోలినాటి వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కింజరాపు పద్మావతి, ఖండ్యాం ఎంపీటీసీ కింజరాపు సురేష్ పాల్గొన్నారు.

28న రా.ర.వే సమావేశం

రాజాం సిటీ: ఈ నెల 28న రాజాం రచయితల వేదిక సమావేశం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించనున్నామని వేదిక నిర్వాహకులు గారరంగనాథం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త, కవి నేతేటి గణేశ్వరరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో 'వన్నెవాడని నన్నెచోడుడు' అనే అంశంపై తానే ప్రసంగించనున్నానని పేర్కొన్నారు. కార్యక్రమానికి భాషాభిమానులు, కవులు, రచయితలు, సాహితీవేత్తలు హాజరుకావాలని కోరారు.

సీసీరోడ్డుపై మట్టి తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువ గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా తాగునీటి కుళాయిల ఏర్పాటు కోసం సంబంధిత కాంట్రాక్టర్ సచివాలయానికి వెళ్లే సిమెంట్ రోడ్డును తవ్వేశారు. పైపు లైన్లు కప్పేసిన తర్వాత మిగిలిన మట్టిని తొలగించకపోవడంతో రోడ్డంతా బురదమయమైంది. ఈ సమస్యపై ఈనెల 25వ తేదీన సాక్షిలో 'మట్టిరోడ్డు కంటే అధ్వానం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి సంబంధిత కాంట్రాక్టర్ స్పందించారు. రోడ్డు మీద ఉన్న మట్టి తొలగింపు పనులను శుక్రవారం చేయించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



చినభీమవరం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నారాయణరావు

బాడంగి: రోజు రోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలిరూరల్ సీఐ నారాయణరావు ప్రజలకు సూచించారు. చినభీమవరం గ్రామంలో ప్రజలకు వివిధ చట్టాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డుల నెంబర్లు అడిగితే చెప్పవద్దన్నారు.,మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని చెప్పారు. గ్రామంలో బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దారి ఇలా... అంతిమ యాత్ర ఎలా..

తెర్లాం మండలంలోని సతివాడ గ్రామ శ్మశాన వాటిక రోడ్డు అధ్వానంగా తయారైంది. అంతిమ యాత్రకు గ్రామస్తులు ఆపసోపాలు పడుతున్నారు. కనీసం నడిచేందుకు కూడా వీలులేకపోవడంతో మృతదేహాలను తరలించేందుకు నరక యాతన పడుతున్నారు. అధికారులు స్పందించి శ్మశాన వాటికకు రోడ్డు సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

\- తెర్లాం



బురదమయమైన రోడ్డుపై శ్మశాన వాటికకు మృతదేహాన్ని తీసుకెళ్తున్న సతివాడ గ్రామస్తులు

ఇళ్ల మధ్య మురుగు..

- మురికి కూపంలా బుడితిపేటలోని రజక వీధి
- మురుగు నీరు బయటకు పోకుండా అడ్డుగా మట్టివేసిన కూటమి నాయకులు
- అయిదునెలలుగా సమస్య ఉన్నా పట్టించుకోని అధికారులు



రజక వీధి మధ్యలో నిలిచిన మురుగునీటిని చూపిస్తున్న స్థానికులు



మురుగునీరు బయటకు వెళ్లకుండా కొందరు అడ్డుగా మట్టి వేసిన దృశ్యం

రేగిడి: మండలంలోని బుడితిపేట గ్రామంలోని రజక వీధిలో మురుగునీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ వీధికి చెందిన రజకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని అన్ని వీధుల వారు వాడుతున్న నీరు తమ నివాసాల మధ్యే నిలిచిపోతోందని, అయిదు నెలలుగా ఈ సమస్య ఉందన్నారు.గతంలో మురుగునీరు పొలాల మీదుగా బయటకు వెళ్లిపోయేదని, ఇప్పుడు మురుగునీరు వెళ్లకుండా కొందరు టీడీపీ కూటమి నాయకులు అడ్డుగా మట్టివేయడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని స్థానికులు అంటున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరినా ఎవరూ పట్టించు కోలేదని రజకులు యండమూరి రాము, యండమూరి లక్ష్మణరావు, వజ్జపర్తి సన్యాసి, యండమూరి దుర్గారావు, యండమూరి చిన్నమ్మడు, వజ్జపర్తి పార్వతి, యండమూరి గౌరమ్మ తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ కూటమి నాయకుల ఒత్తిళ్ల వల్లే ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ముందుకు రావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మురుగునీరు వల్ల దోమలు వృద్ధి చెంది రాత్రిళ్లు నిద్రపట్టనివ్వడం లేదని, జ్వరాలు విజృంభిస్తున్నాయని రజక వీధి వాసులు వాపోతున్నారు. ఇప్పటికే రజక వీధికి చెందిన పది మంది జ్వరాలతో రాజాం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారని బాధిత కుటుంబాల సభ్యులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేకుంటే సుమారు 30 కుటుంబాలకు చెందిన రజకులమంతా గ్రామ సచివాలయం, మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరిం చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి బిందుశేఖర్ వద్ద సాక్షి ప్రస్తావించగా మురుగునీరు బయటకు వెళ్లిపోయేలా ఇటీవలే ఏర్పాట్లు చేశామని, మళ్లీ గ్రామంలోని కొంత మంది వచ్చి మట్టివేశారని తెలిపారు. సమస్యను ఎంపీడీఓ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు.

పరిశీలించిన వైఎస్సార్సీపీ నాయకులు

బుడితిపేటలోని రజక వీధిలో నిలిచిన మురుగునీరును, అధ్వానంగా ఉన్న పరిసరాలను వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ టంకాల ఉమామహేశ్వరరావు, పలువురు నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండల అధికారులు కూటమి నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గడం సరికాదని, సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరారు. మండల అధికారులు సమస్యను పరిష్కరించకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

సౌకర్యాలు లేకపోవడమే మోడల్ రైల్వే స్టేషనా..?



స్టేషన్ ఇన్చార్జ్కి వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బొబ్బిలి: మోడల్ రైల్వేస్టేషన్గా పిలుచుకునే పట్టణంలోని రైల్వేస్టేషన్లో కనీస సౌకర్యాలు కూడా లేవని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వేస్టేషన్లో స్టేషన్ ఇన్చార్జ్ కోటేశ్వరరావును కలిసి రైల్వే స్టేషన్లోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మోడల్ రైల్వేస్టేషన్ అంటే కనీస సదుపాయాలు లేకపోవడమేనా అని ప్రశ్నించారు.రైల్వే స్టేషన్లో వైద్య సౌకర్యం, టాయిలెట్స్ లేవన్నారు. విశాఖపట్నం వెళ్లే రైళ్లు అన్నీ ఉదయం 8 గంటలలోపే వెళ్తున్నాయనీ, ఆ తర్వాత మధ్యాహ్నం రెండు గంటల వరకు ఒక్క రైలు కూడా లేద న్నారు. వేలాది మంది ప్రయాణించే బొబ్బిలి రైల్వే స్టేషన్లో సౌకర్యాలు పెంచాలని కోరారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు,వి.శేషగిరి రావు, ఎస్.గోపాల్ పాల్గొన్నారు.

స్థలం ఇస్తే మెప్మా బజార్ ఏర్పాటు



మాట్లాడుతున్న పీడీ చిట్టి రాజు

బొబ్బిలి: పట్టణంలో మున్సిపాలిటీ యంత్రాంగం స్థలం ఇస్తే డ్వాక్రా బజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మెప్మా పీడీ జి.వి. చిట్టిరాజు తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని డ్వాక్రా సంఘాల సభ్యుల నుంచి మెప్మా బజార్ కోసం రూ.18లక్షల వరకు సేకరించినట్లు చెప్పారు. ఈ నగదుతో బజార్ ఏర్పాటు చేస్తామన్నారు. అయితే ఇంత వరకు స్థలం మాత్రం సమకూరలేదన్నారు. అలాగే తృప్తి హోటల్ ఏర్పాటు చేసుకుని యువత ఉపాధి పొందే అవకాశం ఉందన్నారు. ఒక్కో హోటల్కు రూ.14.50 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పదార్థాలు విక్రయించుకోవచ్చని, ధరల పట్టిక కూడా ప్రభుత్వం నిర్దేశిస్తుందని చెప్పారు. స్థానికంగా ఉన్న ఇతర ఆహార పదార్థాల ఏర్పాటు కూడా ప్రభుత్వ అనుమతితో పొందుపార్చవచ్చని పేర్కొన్నారు. హోటల్ ఏర్పాటుకు ఐఓబీ నుంచి రుణం పొందవచ్చని తెలిపారు. డ్వాక్రామహిళలకు ఇచ్చిన బ్యాంకు లింకేజి రుణాల రికవరీ 98శాతం ఉందన్నారు. మెప్మా బజార్ కోసం జిల్లా కేంద్రంలో సేకరించిన రూ.27లక్షలు తిరిగి సభ్యులకు చెల్లించామన్నారు.

కొత్త వాటర్ ట్యాంకు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్



నేరళ్లవలసలో ఏర్పాటు చేసిన కొత్త ట్యాంకు వద్ద ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పవన్కుమార్, తదితరులు

రామభద్రపురం: మండలంలోని మైదాన ప్రాంతాల్లో పలు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరు కోగా...గిరిజన గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వాటర్ ట్యాంకులు పాడవ్వడం వల్ల తాగునీరు వృథా అవు తున్న తీరు, ప్రజల ఇబ్బందులపై సాక్షిలో ఈనెల 26వ తేదీన 'నీరుగారుతున్నాయ్..!' శీర్షికతో కథనం ప్రచు రితమైంది. ఈ కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. గిరిజన గ్రామాల్లో పూర్తిగా పాడైన ట్యాంకుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పవన్కుమార్కు ఆదేశాలు వచ్చాయి.ఈ మేరకు ఏఈ మండలంలోని నేరళ్లవలసలోని ప్లాస్టిక్ వాటర్ ట్యాంకును తొలగించి కొత్త ట్యాంకు ఏర్పాటు చేశారు ఏఈ మాట్లాడుతూ ఎమ్మెల్యే బేబీనాయన సహకారంతో నేరళ్లవలసలో కొత్త ట్యాంకు ఏర్పాటు చేశామని తెలిపారు.మిగిలిన చోట కూడా కొత్త ట్యాంకుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మెగా వైద్య శిబిరం

వంగర: స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్సీ ఆవరణలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహిచారు. వైద్యాధికారులు సుష్మిత దయానా, ఎస్.అనూష, సుజాత, సిబ్బంది కలిసి శిబిరంలో సుమారు 150 మంది మహిళలు, వృద్ధులకు వివిధ వైద్య పరీక్షలు చేశారు. మహిళలకు ప్రత్యేకంగా క్యాన్సర్స్క్రీనింగ్ టెస్టులు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంతో పారదర్శకత

బొబ్బిలిరూరల్: సమాచార హక్కు చట్టంపై మండలంలోని కారాడ సచివాలయంలో గ్రామస్తులు, రైతులు, సచివాలయ సిబ్బందికి వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ ఏడీఏ మజ్జి శ్యామసుందర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు, పథకాల అమలు తీరును ప్రతీ పౌరుడు తెలుసుకునేందుకే సమాచార హక్కు చట్టాన్ని రూపొందించారని చెప్పారు. ఈచట్టం ద్వారా అధికారులు, సిబ్బంది పనితీరు, పారదర్శకత బయటపడుతుందని అన్నారు.

రేగిడి మండలంలో

రేగిడి: మండలంలోని కొమెర, వెంకటాపురం, కొర్లవలస తదితర గ్రామాల్లో సమాచార హక్కు చట్టంపై మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనివాసరావు రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలతో పాటు రైతులు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగిఉండాలని అన్నారు. వీఏఏలు పాల్గొన్నారు.

వేగావతి నదిలోకి సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు



పెంట గ్రామం వద్ద వేగావతి ఒడ్డున విడిచిపెడుతోన్న సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు



వేగావతి నదిలోకి చేరుతున్న వ్యర్థాలు, మురుగునీరు

బొబ్బిలి రూరల్: నదీ స్నానం పరమ పవిత్రం, ఆరోగ్యకరమని పెద్దలు చెబుతుంటారు. అయ్యప్ప, భవానీ మాలధారులతో సహా నదీ పరివాహక ప్రాంతంలో నివసించే వారంతా వేగావతి నదిలోనే స్నానాలు ఆచరించి అక్కడి నుంచి తాగునీటిని తీసుకెళుతున్న పరిస్థితి. అయితే, నదిలో నేరుగా సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను విడిచిపెడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. బొబ్బిలి పట్టణంలోని సెప్టిక్ ట్యాంకును క్లీన్చేసిన వ్యర్థాలను పెంట సమీపంలో వేగావతి నది ఒడ్డున శుక్రవారం విడిచిపెట్టారు. అదంతా నదిలోకి నేరుగా చేరుతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మహాలక్ష్మీ మనసాస్మరామి

శరన్నవరాత్రి ఉత్సవాలు బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాలు, ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన మంటపాల్లో దుర్గాదేవి అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పలుగ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాజాం మండలంలోని బొద్దాంలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని అర్చకులు శాకంబరీదేవిగా అలంకరించారు.

\- సాక్షి నెట్వర్క్



బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని మహరాణిపేటలో మహాలక్ష్మి అవతారంలో నూకాలమ్మతల్లి



బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని కంచర వీధిలో పూజలందుకుంటున్న దుర్గాదేవి



రామభద్రపురం: బూసాయివలసలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



రాజాం: లక్ష్మీపురంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



బాడంగి: పిన్నవలస శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బొబ్బిలి : బొబ్బిలి పట్టణంలోని బ్యాంకు కాలనీలో పూజలు చేస్తున్న భవానీ భక్తులు



రామభద్రపురం: రామభద్రపురంలోని సాయినగర్ కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు



వంగర: సంగాంలో అన్నదానం